
# నర్సింగ్ హోమ్

— మూరి వెంకటరావు



**అ దొక నర్సింగ్‌హోమ్. దాని అధిపతి మాణిక్యం రివాల్వింగ్ ఛెయిర్‌లో ఊగుతూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు.**

"సార్-కొంప ముని గింది" అన్నాడు రిసెప్షనిస్టు రంగారావు లోపలికొచ్చి.

అనుమతి లేకుండా అతడు లోపలికొచ్చినందుకు అరికాలు మంట నెత్తికెక్కినా తమాయించుకుంటూ "ఎవరి కొంప నీదా, నాదా ?" అన్నాడు ఎగతాళిగా ఫోన్ క్రెడిల్ చేస్తూ.

"మనదే సార్ !"

"వ్హాట్ నాన్‌సెన్స్ యు ఆర్ టాకింగ్" కోపంగా ముందుకు జరిగాడు మాణిక్యం.

"సారీ సార్, వాళ్ళు కోర్టుకు వెళతామంటున్నారు".

తల తోక లేని రంగారావు మాటలకు చిర్రెత్తుకొచ్చింది మాణిక్యానికి.

"ఏమిటి నువ్వంటోంది ? చెప్పేదేదో తిన్నగా చెప్పి తగలడు" అన్నాడు కళ్ళు చిట్లిస్తూ.

"మొన్న జరిగిన ఆపరేషన్‌లో పేషెంట్..."

"వాడి ఆయువు మూడింది చచ్చాడు."

"అలా అని వాళ్ళు వాళ్ళు సరిపెట్టుకోవడం లేదుసార్. మీ మీద, డాక్టర్ గారి మీద ..."

"కోర్టుకెళతామంటున్నారు" లోపల కొస్తూ మాట పూర్తి చేశాడు డాక్టర్ సుధీర్.

"వెళితే వెళ్ళనివ్వండి. మీరెందుకు కంగారు పడతారు ? డాక్టర్లు దేవుళ్ళు కాదు రోగులందరినీ బ్రతికించేయడానికి ?" అన్నాడు మాణిక్యం.

"అలా తేలిగ్గా తీసి పారేయడానికి వీల్లేదు సార్. నిజానికి నేనా ఆపరేషన్ చేయకూడదు. మీ వత్తిడి వల్ల చేయవలసి వచ్చింది.

అందుకు నన్ను ప్రాసిక్యూట్ చేసినా చేయవచ్చు. ముఖ్యంగా ఏ క్వాలిఫికేషను లేని మీరు సబ్జెక్టు కన్‌సర్న్ లేని డాక్టర్ల చేత ఆపరేషన్ చేయించడం..."

సుధీర్ మాటలతో బల్బు వెలిగింది మాణిక్యానికి. "ఇప్పుడేం చేద్దామంటారు?" అన్నాడు సాలోచనగా.

"అదే నాకూ తోచడం లేదు. ఆపరేషను చేయించుకున్న వ్యక్తి అనామకుడైతే ఫరవాలేదు. మీకు తెలుసనో తెలియదో రోగి తరఫు వాళ్ళ నుంచి అండర్ టేకింగ్ తీసుకోకుండా ఆపరేషన్లు చేయడానికి వైద్య వృత్తిలో ఉన్న మహామహులే జంకుతున్నారు. దర్యాప్తు అంటూ జరిగితే చాలా విషయాలు వెలుగులో కొస్తాయి. ఆపరేషన్‌కు ముందు జరగవలసిన పరీక్షలన్నీ సక్రమంగా జరిగాయా ? లేదా ? వాటి రిపోర్టు లెలా ఉన్నాయ్ ? రోగికి ఇచ్చిన ఎనస్తీషియా మోతాదు కానీ మించిందా ? బి. పి. అప్పుడు ఏ స్టేజిలో ఉంది. అసలు ఆపరేషను చేసిన డాక్టరు అందుకు అర్హుడా కాడా ?... ఇలా సవాలక్ష అంశాలు తలెత్తుతాయి."

ఆ మాటకు 'అమ్మో !' అంటూ బెంబేలెత్తిపోయాడు మాణిక్యం. శరీరం చమటపట్టి చొక్కా ముద్ద అయింది. ఎంత ఆలోచించినా అతనికి కర్తవ్యం స్ఫురించడం లేదు. ఆ రోజు మావయ్య తనని నర్సింగ్ హోమ్ పెట్టవద్దని ఎందుకన్నాడో ఇప్పుడర్థమైంది. ఇందుకు ఏదో ఒక ఉపాయం చెప్పడానికి అతడే సమర్థుడు అనుకుని మావయ్య

వద్దకు బయలుదేరాడు.

"ఎలా ఉంది నీ నర్సింగ్ హోమ్?" పలకరింపుగా అడిగాడు వరహాలు.

ఆ మాట తనను గేలి చేస్తున్నట్లనిపించింది మాణిక్యానికి.

"క్షమించు అంకుల్. నీ మాట వినకుండా నర్సింగ్ హోమ్ పెట్టినందుకు నాకు తగిన శాస్తే జరిగింది" అన్నాడు.

"ఇంతకు ఏమైందిరా ?" అని అడిగాడు వరహాలు మేనల్లుడి మాటలకు విస్తుపోతూ.

విషయం వివరించాడు మాణిక్యం.

వరహాలుకు గతం కళ్ళ ముందు మెదిలింది.

★ ★ ★

"కాఫీ చల్లారిపోతున్నా పట్టించుకోకుండా ఏవిటండీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?" అంటూ దగ్గరకొచ్చింది వసంత.

భార్య మాటలకు ఉలిక్కిపడ్డా "అబ్బే ఏం లేదంటూ" సర్దుకున్నాడు వరహాలు.

"ఏమీ లేకపోవడమేంటి ?" మీరింత పరధ్యానంగా ఉండడం నే నెప్పుడూ చూడలేదు" నిలదీస్తున్నట్లంది వసంత.

ఇహ వరహాలుకి మనసులో మాట బయట పెట్టక తప్పింది కాదు.

"బావగారు పోయి సంవత్సరం అవుతున్నా మళ్ళీ అక్కడికి వెళ్ళడం కుదర్లేదు. అక్కయ్య, పిల్లలు ఎలా ఉన్నారో ఏమిటో ? ఇద్దరు కొడుకులున్నారన్న మాటే కానీ ఒక్కడికి సరిగ్గా చదువంటలేదు" నిట్టూర్చాడు వరహాలు.

"చదూకోకపోతేనేం ? చచ్చినంత ఆస్తి ఉంది. తింటూ కూర్చుంటారులెండి. మీకా బెంగేమీ అక్కర్లేదు. ఎంతలేదన్నా అథమ పక్షం వంద తులాల బంగారముంటుంది మీ అక్కయ్య వంటిని" అన్నది వసంత మూతి విరుస్తూ.

మాటల్లో వచ్చాడు మాణిక్యం.

పలకరించి లోపలకు వెళ్ళిపోయింది వసంత.

"ఇప్పుడే మీ గురించి అనుకుంటున్నాం. వెయ్యేళ్ళు ఆయుష్షు " అన్నాడు వరహాలు నవ్వుతూ.

"అంత ఆయుష్షు నా కెందుకు మావయ్యా ఐశ్వర్యం ఉండాలని దీవించు చాలు".

"బ్రతుకు సార్థకమవ్వాలంటే రెండూ ఉండాలిరా-సరేగానీ ఇప్పుడు నువ్వేం చేస్తున్నావో చెప్పావు కాదు."

"ఇంతవరకూ ఏం చేయలేదు. బిజినెస్ చేస్తే ఎలా ఉంటుందంటావ్ ?" సలహా అడిగాడు మాణిక్యం.

"బాగానే ఉంటుంది. ఇంతకు ఏం వ్యాపారం చేయాలనుకుంటున్నావు ?"

"ఈ రోజుల్లో నా కంటికి బాగా ఫెచ్చింగ్గా కనిపిస్తున్నవి రెండే రెండు. ఒకటి కాన్వెంట్-రెండోది నర్సింగ్ హోమ్" అన్నాడు మాణిక్యం.

"వాటిల్లో వేటికీ నీకు అర్హత లేదు కదరా" ఆందోళన వ్యక్తం చేశాడు వరహాలు.

"నువ్వెంత సత్తెకాలపు మనిషివి మావయ్యా" పగలబడి నవ్వాడు మాణిక్యం.



"నేనన్నదాంట్లో తప్పేముందిరా ?"

"లేకపోతే ఏవిటి మామయ్యా-స్కూలు పెట్టాలంటే మాస్టారవ్వాలి గానీ, నర్సింగ్ హోమ్ పెట్టాలంటే డాక్టరవ్వాలనిగాని రూలు ఏవైనా ఉందా ?"

"మరి ?"

"రవ్వంత లోకజ్ఞానం, కాస్తంత తైలం ఉంటే చాలు. దేనికైనా సిద్ధపడొచ్చు."

"ఏవిట్రా నువ్వంటున్నది. పదో క్లాస్ అయినా పూర్తి చేయని నువ్వు స్కూలు, నర్సింగ్ హోమ్ పెడతావా ? వద్దురా పిల్లల జీవితాలతోనూ, రోగుల ప్రాణాలతోనూ చెలగాటమాడకు" అన్నాడు వరహాలు మేనల్లుడి మాటలకు ఆందోళన వ్యక్తం చేస్తూ.

★ ★ ★

వరహాలు నోటి నుండి ఏ మాటా రాకపోవడంతో "చెప్పు మావయ్యా. ఏదైనా సలహా ఇవ్వు. నీకు ఆజన్మాంతం ఋణపడి ఉంటాను" బ్రతిమిలాడాడు మాణిక్యం.

గతం నుండి వర్తమానంలోకి వచ్చాడు వరహాలు.

"సరే, నిన్ను ఈ ఆపద నుంచి తప్పించేందుకు నేను శాయశక్తులా కృషి చేసాను. అందుకు ముందు నువ్వు నాకో హామీ ఇవ్వాలి" అన్నాడు.

ఏమిటన్నట్లు చూశాడు మాణిక్యం.

"రేపటి నుండి నువ్వు నర్సింగ్ హోమ్ మూసేస్తానంటే చెప్పు."

"ఏవిటి నువ్వంటోంది ? నేను నర్సింగ్ హోమ్ మూసెయ్యాలా" అదిరిపడుతున్నట్లున్నాడు మాణిక్యం.

"ఔన్రా. నువ్వు వెంటనే నర్సింగ్ హోమ్ మూసెయ్యాలి. అలా చేస్తానంటే చెప్పు" షరతు విధించాడు వరహాలు.

వేరేదారేదీ కానరాకపోవడంతో సరేనన్నాడు మాణిక్యం.

వెంటనే మేనల్లుణ్ణి వెంటేసుకుని చనిపోయిన రోగి తల్లిదండ్రులు వద్దకెళ్ళాడు వరహాలు.

వచ్చిన వ్యక్తిని ఎగాదిగా చూశారు జగన్నాథం దంపతులు.

"ఆపరేషను అయింది మీ అబ్బాయికేనా ?" అడిగాడు వరహాలు.

"ఔను. అదుగో ఆయన నర్సింగ్ హోమ్ లోనే జరిగింది. డాక్టర్ల అశ్రద్ధ వల్లే మా బాబు మాకు దక్కకుండా పోయాడు" అన్నాడు జగన్నాథం కంటతడిపెడుతూ.

"మీరీ విషయంలో కోర్టుకు వెళతామంటున్నారట."

"ఔను. ఆ డాక్టర్ని, ఈయన్ని జైలుకు పంపేవరకూ మేం నిద్రపోం" అన్నాడు జగన్నాథం కసిగా.

"అలా చేయడం వల్ల మీ అబ్బాయి మీకు తిరిగొస్తాడా ?" ఎదురు ప్రశ్న వేశాడు వరహాలు.

"రాడు. అయితే నాకు జరిగిన అన్యాయం మరో తండ్రికి జరక్కూడదు."

"మీకా బెంగ అనవసరం. మాణిక్యం నర్సింగ్‌హోమ్ మూసేస్తానంటున్నాడు."

"అది సరే మా కాంపెన్సేషన్ మాట."

"ఆ పైకం రావాలంటే చాలా కాలం పడుతుంది. పిలిచినప్పుడల్లా కోర్టుకు అటెండవ్వాలి. ప్లీడరు ఖర్చులు భరించాలి. ఆ బాధలేవీ లేకుండా మీకు మా మాణిక్యం లక్ష రూపాయలు ఇస్తానంటున్నాడు. ఇష్టమైతే చెప్పండి" అన్నాడు వరహాలు బ్యాగులోంచి నోట్ల కట్టలు తీస్తూ.

డబ్బు వంక ఆశగా చూశాడు జగన్నాథం.

"హమ్మయ్య" గుండెలు నిండా గాలి పీల్చుకున్నాడు మాణిక్యం.

అంతే ఆ రోజులగాయితూ మాణిక్యం మరి నర్సింగ్ హోమ్ జోలికి పోతే ఒట్టు.